
# అందం - ఆయుధం

— సుంకర భాస్కరరావు



డాక్టర్ సుధాకర్, డాక్టర్ గోపాల్రావ్ స్నేహితులు. ఫ్రెష్‌గా మెడిసిన్ పూర్తిచేసి, ఒకే సిటీలో ప్రాక్టీస్ పెట్టారు.

డాక్టర్ సుధాకర్ డిస్పెన్సరీలో మిస్ స్మిత అనే అందమైన నర్సు— వయసు పొంగుల వయ్యారి వుండడం ఆ డిస్పెన్సరీకే అందం తెచ్చింది. గోపాల్రావ్ ఎప్పుడైనా సుధాకర్ డిస్పెన్సరీకి వస్తే, స్మిత స్వీట్‌గా నవ్వుతూ గ్రీట్ చేసేది. ఆ నవ్వు గోపాల్రావ్ మనసులో ముద్ర వేసుకుంది.

సుధాకర్ డిస్పెన్సరీ కొచ్చిన ప్రతిసారీ గోపాల్రావ్‌కి ఆ కుర్ర నర్సు కనిపించేది. కల్పించుకుని గోపాల్రావ్‌తో మాట్లాడేది. ఎప్పుడైనా స్మిత కనిపించకపోతే, "మీ డిస్పెన్సరీ బ్యూటీ ఎక్కడ్రా?" అని సుధాకర్ని బోల్డ్‌గా అడిగేసేవాడు గోపాల్రావ్. నవ్వేసి, సుధాకర్ ఆ పిల్లని ఏదో సాకుతో పిలిపించేవాడు. గోపాల్రావ్ కళ్ళకి ఆ పిల్ల తన అందాలతో, హావభావ వయ్యారాలతో విందు వడ్డించేది. అంతటితో తృప్తిపడేవాడు గోపాల్రావ్ అనబడే ఆ రసిక కుర్ర డాక్టర్.

ఒక రోజు సుధాకర్ని చూడాలని వచ్చిన డాక్టర్ గోపాల్రావ్ మాటల్తో చాలా సేపు గడిపాడు. కాని ఆ మిఠారి అంటే స్వీట్ సిక్స్‌టీన్ డాల్ నర్స్ స్మిత కనిపించలేదు. ఉండబట్టలేక గోపాల్రావ్ ఆ కుర్ర నర్సు కానరాని వైనం అడిగేశాడు -

"ఏమైందిరా మీ డిస్పెన్సరీ బ్యూటీ?"

"ఎవరు? స్మితా?" గోపాల్రావ్ కళ్ళలోకి చూస్తూ అడిగాడు డాక్టర్ సుధాకర్.

"అవును. స్మితే. ఆమె కాక నీ డిస్పెన్సరీకి కళ తెచ్చే నర్సింకెవరు?"

"నిజమే. స్మిత అందగత్తె. కాదనను. నేనామెని ఉద్యోగంలోంచి తీసేశాను" అన్నాడు డాక్టర్ సుధాకర్.

"ఓహ్ ... క్రూయల్ ... అన్యాయం! అంత పెద్ద తప్పేం చేసింది ఆ పూర్ గర్ల్?"

"తప్పా? ... ఆమెదేం తప్పులేదు. అంతా ఆమె అందానిదే! ఆమె అందమైన నవ్వుదే..."

"అంటే? అర్థమయ్యేలా చెప్పరా సుధాకర్!"

"ఏముంది? ఆమె అందంగా వుండడం వలన నా వృత్తి దెబ్బతినేలా వుంది" అన్నాడు సుధాకర్.

"అంటే ... నీకు ట్రాప్ వేసిందా?" గోపాల్రావ్ యథాలాపంగా అడిగాడు.

"నో ... అటువంటిదేమీ లేదు."

"మరి? ... ఉద్యోగంలోంచెందుకు తీసేసావామెని?..."

"ఎందుకంటే ..." కాసేపాగాడు డాక్టర్ సుధాకర్. మళ్ళీ చెప్పసాగాడు. "ఒక రోగి ఆమెతో 'నీ నవ్వు అద్భుతం. అది అలా చూస్తూ వుంటే, నా రోగం ఇప్పుడే నయమయేలా వుంది' అంటుండగా విన్నాను. అదీ సంగతి..." అన్నాడు నవ్వుతూ డాక్టర్ సుధాకర్.

నవ్వలేకపోయాడు డాక్టర్ గోపాల్రావ్.

"ఓహ్ పూర్ గర్ల్ ... నాకు ఫోన్ చేసి చెప్పలేకపోయావా?. నేనే పెట్టుకునేవాణ్ణి - నా డిస్పెన్సరీలో ..." అన్నాడు నిరుత్సాహంగా డాక్టర్ గోపాల్రావ్.

"నీకా అవకాశం లేదురా! ఆమెని నా ఇంట్లో పెట్టుకోబోతున్నాను" కూల్‌గా అన్నాడు డాక్టర్ సుధాకర్.

"అంటే?..." ఇంకా ఆశ్చర్యపోయాడు ఆ కుర్ర డాక్టర్.

"యా!... అంటే ... ఆమె నాకు పుట్టబోయే పిల్లలకి తల్లి కాబోతోందిరా" అంటూ నవ్వేశాడు డాక్టర్ సుధాకర్.

ఒక వేడి నిట్టూర్పు వదిలాడు డాక్టర్ గోపాల్రావ్.

"ఓహ్ ... ఓకె ... కంగ్రాచ్యులేషన్స్ ..." అని నిరుత్సాహంగా అక్కణ్ణుంచి లేచాడు డాక్టర్ గోపాల్రావ్.

వెళ్తున్న మిత్రుణ్ణి చూసి, మందహాసం చేశాడు డాక్టర్ సుధాకర్. అప్పుడే మొదటిసారి ఖరీదైన చీరెలో, నగల్తో ఆ డిస్పెన్సరీలోకి అడుగుపెట్టింది అందం ఆయుధంగా వున్న మిస్ స్మిత. తల వంచి పోతున్న డాక్టర్ గోపాల్రావ్ ఆమెని చూడలేదు. అతన్ని చూసినా, ఆమె ఆగి పలకరించలేదు అతన్ని. ◆



23-3-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక